క్లుప్తంగా

గోశాలకు వరిగడ్డి వితరణ



వితరణ చేసిన వరిగడ్డితో ప్రతినిధులు

నేలకొండపల్లి: స్థానిక సుగుణ బేకరి యజమాని మాటూరి శేషగిరిరావు మనవరాలు ఉదయలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యాన ఖమ్మంలోని ఖానాపురం గోశాలకు 100 వరిగడ్డి దిండ్లను వితరణగా పంపించారు. ఈమేరకు ఉదయలక్ష్మి తల్లిదండ్రులు మాటూరి సుబ్రహ్మణ్యం, శ్రీదేవిలతో పాటు శేషగిరిరావు, సుగుణలను క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, తెల్లాకుల జయశ్రీ , దోసపాటి రామయ్య, దోసపాటి కల్పన, ఓరుగంటి సౌజన్య, రాయపూడి ఉష, వంగవీటి సావిత్రి, తెల్లాకుల ఆశోక్, కొత్తా కరుణ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న నాగేశ్వరరావు

కామేపల్లి: మండలంలోని గోవింద్రాల గ్రామంలో ఇటీవల ఒకే కుటుంబానికి చెందిన లావుడియా సక్రాం దంపతులు, కుమారుడు చరణ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏన్కూర్ సత్య గాయిత్రి ట్రేడర్స్ ప్రొప్రేటర్ ఊట్కూర్ నాగేశ్వరరావు రూ.20 వేల చెక్కును ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో లావుడియా కృష్ణ, హట్కర్ మంగీలాల్, మాలోత్ బాషింగ్, లకావత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఖమ్మం సహకారనగర్: గతేడాది అక్టోబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరం పాఠశాల చివరి పని దినమైన ఈ నెల 23వ తేదీన రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీలు నిర్వహించి, రిలీవ్ చేయకపోవడం వల్ల ఉపయోగం లేదని, మధ్యంతరంగా నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీల కౌన్సిలింగ్‌ను ప్రారంభించి వేసవి సెలవుల్లో పూర్తి చేయాలన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని, టెట్ ఉత్తీర్ణత కావడానికి ఐదేళ్ల కాల పరిమితి విధించి పదోన్నతులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. టెట్‌లో నెలకొన్న సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని తెలిపారు.

'రాయల' పర్యటన

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం , పైనంపల్లి తదితర గ్రామాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు పర్యటించి నూతన వధూవరులను ఆశీర్వదించి పలువురిని పరామర్శించారు. వారి వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ సేవాదళ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, సూరేపల్లి రవి, రాయపూడి నారాయణరావు, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ఉసిరికాయల లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డి..

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. సాయిప్రభాత్‌నగర్, మద్దులపల్లిలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

కామేపల్లి: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు బోడేపూడి విఠల్‌రావు అన్నారు. ఆదివారం పండితాపురం గ్రామంలో పలువురి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పరామర్శించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పెరిగి.. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతీ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకపోతుల మహేష్‌గౌడ్, బండి ఉపేందర్, హరిచంద్రనాయక్, బండి లక్ష్మీనర్సు, బత్తుల వీరబాబు, రాంబాబు, మొగిలి ముత్తిలింగం, శ్రీను, గుగులోత్ రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ

కామేపల్లి: మండలంలోని ఊట్కూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠ కార్యక్రమం చేశాక భక్తులకు అన్నదానం చేశారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం..!





పాకబండ బజార్‌లో రోడ్డు వెంట వేసిన వ్యర్థాలు

నగరంలో లోపిస్తున్న పరిశుభ్రత

- రోడ్ల వెంట పడేస్తున్న వ్యర్థాలు
- డ్రెయినేజీల్లో చేరి పేరుకుపోతున్న మురుగు
- కంపుకొడుతున్న వీధులు
- నిర్లక్ష్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది
- పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక డ్రైవ్‌కు ప్రణాళికలు

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య నిర్వహణలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు గతంలో రాష్ట్రస్థాయిలో మంచి పేరు ఉంది. స్వచ్ఛ ఖమ్మం విభాగంలో అవార్డులను అందుకుంది. అయితే ఇటీవల కాలంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో నగరంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. ఇంటింటి చెత్త సేకరణ నిర్వహణ సక్రమంగా జరగకపోవడంతో గృహాల్లోని వ్యర్థాలను రోడ్ల వెంట, కూడళ్లల్లో పోస్తున్నారు. పలు డివిజన్లలో మూడు, నాలుగు రోజులకు ఒకసారి కూడా చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్ల వెంటే వ్యర్థాలు..

రోజు విడిచి రోజు నగరంలో కేఎంసీ ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నారు. ఇటీవల కాలంలో చెత్త సేకరణలో వాహనాలు సమయానికి రాకపోవడంతో గృహాల్లో వెలువడుతున్న వ్యర్థాలను రోడ్ల వెంట పోస్తున్నారు. ఈ వ్యర్థాలు రోజుల తరబడి ఎత్తకపోవడంతో అవి డ్రెయినేజీల్లోకి చేరి పూడుకుపోతున్నాయి. దీంతో ఎక్కడికక్కడే మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయాల్సి ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మురుగుమయంగా ఉంటున్నాయి.

పెత్తనం ఉంటే చాలు..

నగర పాలక సంస్థలో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్ర స్థాయిలో కార్మికులతో పని చేయించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లు తీవ్ర నిర్లక్ష్యంగా ఉంటున్నారని తెలుస్తోంది. కొంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నతాధికారుల పేరు చెప్పుకొని క్షేత్ర స్థాయిలో పెత్తనం చలాయిస్తూ పారిశుద్ధ్యాన్ని పక్కనపెట్టినట్లు సమాచారం. డబ్బులు తీసుకుంటూ డివిజన్లలో తమదే పెత్తనం అన్నట్లుగా జవాన్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. చెత్త సేకరణ చేపట్టకపోయినా, డ్రెయినేజీలు శుభ్రం చేయకున్నా పర్వాలేదు.. తమ మాట వింటే చాలన్నట్లు జవాన్లు కార్మికులకు హుకుం జారీ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక శానిటేషన్ విభాగం అధికారి, ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణను చూస్తామని చెప్పి డివిజన్లు పంచుకొని మరీ జవాన్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని, పారిశుద్ధ్య నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదన్న చర్చ కేఎంసీలో చర్చనీయాంశంగా మారింది.

ప్రత్యేక డ్రైవ్‌కు ప్రణాళికలు..

ఇటీవల కేఎంసీలో పారిశుద్ధ నిర్వహణపై విమర్శలు వస్తుండడంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. నగరంలోని 60 డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. రోజుకు ఒక డివిజన్‌లో గ్యాంగ్ వర్క్ నిర్వహించాలని, డ్రెయినేజీలు, రోడ్లు, కూడళ్ల శుభ్రం చేయాలని నిర్ణయించారు. శ్రీరామ నవమి తర్వాత ఈ డ్రైవ్‌ను ప్రారంభించేందుకు కేఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. డ్రైవ్ నిర్వహించే డివిజన్‌లోని కార్మికులతో కాకుండా బయట డివిజన్‌ల నుంచి 20 మంది కార్మికులను తీసుకెళ్లి ఆ డివిజన్‌లో అన్ని డ్రెయినేజీలు, కూడళ్ల, రోడ్లను శుభ్రం చేయించనున్నారు. ఈ డ్రైవ్ నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు చేశారు.

వ్యర్థాలను కాల్చివేస్తున్న సిబ్బంది..

డివిజన్లలో వ్యర్థాలను సేకరించకపోవడంతో స్థానికులు ఖాళీ ప్రదేశాలు, కూడళ్లల్లో పోస్తున్నారు. వీటిని ఎత్తించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆ వ్యర్థాలకు అక్కడే నిప్పు అంటించి తగలబెట్టిస్తున్నారు. కార్మికులచేత వ్యర్థాలు ఎత్తించాల్సిన జవాన్‌లు ఇలా చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, పాత క్లాత్‌లు, ఆకులు, ఇతర గృహ వ్యర్థాలను కాల్చుతున్న సమయాన వచ్చే పొగకు చుట్టు పక్కల నివాసం ఉండేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు సైతం పారిశుద్ధ్య నిర్వహణపై పట్టనట్లు వ్యవహరిస్తుండడంతోనే క్షేత్రస్థాయి సిబ్బంది ఇలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



బ్యాంక్ కాలనీలో వ్యర్థాలను తగలబెడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

దృష్టి సారిస్తున్నాం..

నగరంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తున్నాం. 60 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రోడ్ల వెంట చెత్త వేయకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. వ్యర్థాలను కాల్చితే చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్, కేఎంసీ

గాలి దుమారం

మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం గాలి దుమారం, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండవేడిమితో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలు ఒక్కసారిగా వర్షం రావడంతో వాతావరణం చల్లబడి ఊపిరి పీల్చుకున్నారు. కాగా, వర్షం రాకతో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న వంటి పంటలు తడవడంతో రైతులు కొంత ఆందోళనకు గురయ్యారు. గాలిదుమారానికి అక్కడక్కడ చెట్లు విరిగి పడదంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరూరల్: సూర్యాపేట-ఖమ్మం రహదారిపై విరిగి పడిన చెట్లు, తెగిన విద్యుత్ తీగలు



కూసుమంచిలో తాటిచెట్టుపై పిడుగుపడి అంటుకున్న మంటలు



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో తడిసిన మొక్కజొన్నలను ఎత్తుతున్న రైతు



నేలకొండపల్లి: కొత్తకొత్తూరులో తడిసిన ధాన్యం బస్తాలను ఎత్తుతున్న హమాలీలు

అధిష్టానం ఆదేశం మేరకు పని చేస్తాం..

ఖమ్మంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అధిష్టానం మేరకే పని చేస్తామని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా టీడీపీ పూర్వవైభవాన్ని పుంజుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు హనుమంతరావు, కొండబాల కర్ణాకర్, మల్లెంపాటి అప్పారావు, చుండూరు రాజేశ్వరి, వాసిరెడ్డి భాస్కర్‌రావు, మేడిపల్లి రాణి, కట్రం స్వామి, బీవీ రాఘవులు, సానబోయిన శ్రీనివాస్ గౌడ్, పసలం వెంకటేశ్వర్లు, పోటు సరస్వతి, మందపల్లి రజిని, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రామనాథం

రైతు బిడ్డను ఆశీర్వదించండి

బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ



వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న నామ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల కష్టాలు తెలిసిన రైతు బిడ్డను అని, తనకు ఈ ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉదయం ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌లో వాకర్స్‌ను కలిసి ఓట్లను అభ్యర్థించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మీ ఆశీర్వాదం వలనే ఎంపీగా, బీఆర్‌ఎస్ లోక్‌సభ పక్షనేతగా పని చేశానని, ప్రజా సమస్యలపై గళం విప్పానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీలు గెలిస్తేనే తెలంగాణ ప్రయోజనాలు, హక్కులు కాపాడబడతాయని, ఈ ఎన్నికల్లో తనను గెలిపించి కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, జస్వంత్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఖాదర్‌బాబు, కోశాధికారి జనార్దన్‌రావు, గుత్తా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జైపాల్, మోరంపూడి ప్రసాద్, గోడ్డేటి మాధవరావు, తాళ్లూరి హరీష్, చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలకు పెద్దపీట...

బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర

ఖమ్మం మామిళ్లగూడెం: కోచ్‌లకు ప్రోత్సాహం, క్రీడలకు పెద్ద పీట వేస్తామని ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆదివారం సర్దార్‌పటేల్ స్టేడియంలో వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా అర్చరీ, బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్ కోర్టులో కాసేపు ఆడి క్రీడాకారులు, కోచ్‌లతో ముచ్చటించారు. ఆటగాళ్ల జీవితాల్లో కోచ్‌ల పాత్ర కీలకమని, క్రీడాకారులు, వాకర్స్‌లకు మెరుగైన సదుపాయాల కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, భద్రం , శ్రీనివాస్, భిక్షపతి, చావా కిరణ్, ప్రతాప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక, ఇంటింటి ప్రచారం..

కూసుమంచి/ఖమ్మంమామిళ్లగూడెం/కామేపల్లి: కూసుమంచి మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు బీజేపీ నాయకుడు రవికుమార్ ఆధ్వర్యాన ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు సతీమణి వినీల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే ఖమ్మంలో ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ పెవిలియన్ గ్రౌండ్ ప్రాంతంలో పలువురిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. అలాగే, నగరంలోని 57వ డివిజన్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రగాని మాధవ్ ఆధ్వర్యాన, 37వ డివిజన్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన, కామేపల్లి మండలంలోని జాస్తిపల్లి గ్రామంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల వెంకటనారాయణ ఆధ్వర్యాన ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు మేకల నాగేందర్, డి.సత్యనారాయణ, సుధాకర్, మహేందర్, కృష్ణాచారి, రవిగౌడ్, మల్లారెడ్డి, సరస్వతి, విజయారెడ్డి,భద్రం, యుగంధర్ నాయుడు, కమర్లపుడి ఉపేందర్, మారుతి, శేష ఫణికుమార్ శర్మ, పసుమర్తి సంతోష్, హత్యా నాయక్, జర్పుల రామారావు, గోపి, చల్లా మల్లయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా క్రికెట్ ఆడుతున్న తాండ్ర

అభివృద్ధిని చూపించి ఓట్లు అడగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూపాకే ఓట్లు అడగాలని రైతు ఆత్మహత్యల నివారణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంజీరాల రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని కస్బాబజార్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీల అమలుకు బీజేపీ ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. నిరుద్యోగులు, ఉపాధి రైతులకు రుణమాఫీ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను అమాంతం పెంచి ప్రజలను అప్పులపాలు అయ్యేలా చేసిందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హత్యకు కుట్ర చేసిన వారిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవనున్నామని, అంతేకాక జిల్లాకు నామ చేసిన అభివృద్ధి చూపి ఓట్లు అడగాలన్నారు. ఈ సమావేశంలో ఉడుత లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు తలసేమియా చిన్నారులకు ప్రాణదాతలు

ఖమ్మంవైద్యవిభాగం: వేసవిలో రక్తం లేక తలసేమియా చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ తరుణంలో రక్తదాతలు వారికి ప్రాణదాతలుగా మారుతున్నారని ప్రముఖ వైద్యుడు గిరిసింహారావు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మంలోని తలసేమియా డేకేర్ సెంటర్(రితన్య ఆస్పత్రి)లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డి.నారాయణమూర్తితో కలిసి గిరిసింహారావు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజు పది మందికి పైగా చిన్నారులకు అవసరమైన రక్త సేకరణ కోసం సంస్థ బాధ్యులు పడుతున్న ఇబ్బందులను చూస్తున్నామని, దాతలు స్పందిస్తే ఈ వేసవిలో చిన్నారులను కాపాడినవారవుతారని అన్నారు. సంస్థ కోశాధికారి పి.రవిచందర్ మాట్లాడుతూ.. మే 8న ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ సంస్థ ఆధ్వర్యాన ప్రతీ ఏడాది నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, ఉచిత మందుల పంపిణీ, తలసేమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి తలసేమియా చిన్నారులందరికీ ఐరన్, హెచ్‌ఎల్‌ఏ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ఎండల వలన చిన్నారులకు రక్తం దొరకడం లేదని, కోరిన వెంటనే ముందుకొచ్చి రక్తదానం చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో చిన్నారుల తల్లిదండ్రులు, బంధు మిత్రులు రక్తదానం చేసి విజయవంతం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, బాధ్యులు పి.ఉదయ్ భాస్కర్, పి.అనిత, ఎస్‌ఉపేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు గిరిసింహారావు

అలరించిన 'విముక్తి' నాటిక



ప్రశంసా పత్రాలు అందిస్తున్న అతిథులు

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'విముక్తి'నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. మత్తు పదార్థాల నుంచి యువతకు విముక్తి కలిగిద్దాం.. దేశాన్ని రక్షించుకుందాం అనే సందేశంతో ఈ నాటికను ప్రదర్శించారు. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించిన నాటికను ఉషోదయ కళానికేతన్ కట్రపాడు కళాకారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైద్యుడు డాక్టర్ కొలికొండ మహేంద్రకుమార్ మాట్లాడుతూ.. చైతన్యవంతమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న నెల నెలా వెన్నెల కార్యక్రమాలను ప్రజలు ఆదరించి ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఆర్క్స్ సంస్థ అధ్యక్షుడు మోటమర్రి జగన్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, పోలా శ్రీనివాస్, శ్రీవిద్య, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, ఆర్క్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, కె.దేవేంద్ర, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నామ లక్ష్మీనారాయణ, కార్యదర్శి సదానందం, నందిగామ కృష్ణ, మారుతి కొండల్‌రావు, చెరుకుపల్లి వెంకటేశ్వరరావు, శిధర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక స్థైర్యం కోసం మోడల్ ఎంసెట్

ఖమ్మంమయూరిసెంటర్: ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థుల్లో మనోస్థైర్యం పెంపొందించేందుకే మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం ఉదయం జిల్లా వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే పేపర్‌ను తయారు చేసి ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఉచితంగా తమ సంఘ కార్యాలయంలో ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడల్ టెస్ట్ రాసేందుకు ఆసక్తి గల విద్యార్థులు 81061 46993, 96666 80674, 93981 91241 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు శివ, వంశీ, రాహుల్, హరికృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

అటెన్షన్ ప్లీజ్

డస్ట్.. బాబోయ్!



రోడ్డుపై పడిన డస్ట్‌తో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కరీంనగర్ నుంచి సత్తుపల్లి ప్రాంతానికి రోడ్డు నిర్మాణ పనులకు నిత్యం వందలాది లారీలు తరలివెళ్తున్నాయి. ఈ నేపథ్యాన డస్ట్ లారీల నుంచి రోడ్డుపై పడిపోవడంతో వచ్చిపోయే వాహనాల దాటికి ఇదిగో ఇలా దుమ్ములేస్తుంది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారుల కళ్లల్లో పడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డస్ట్ తరలిస్తున్న లారీలపై చర్యలు తీసుకుని ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- తిరుమలాయపాలెం